పల్లిపాలెంలో నిలిచిన మత్స్యకారుల బోట్లు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మొంథా తుపాను ప్రభావంతో అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో సముద్రంలో వేటకు వెళ్లే సుమారుగా 200 బోట్లను పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో మంగళశారం జెట్టి వేసి నిలిపి వేశారు. వీటిలో సుమారుగా 50 సోనాబోట్లు కాగా 100 కి పైగా మెకనైజ్‌డ్ బోట్లు, మిగిలినవి సాధారణ మోటార్ పడవలు ఉన్నాయి. పల్లెపాలెం నుంచి వేట చేసే చాలా వరకు మత్స్యకారులు ఇతర ప్రాంతాల వారే .

తుపాను కారణంగా నిలిచిపోయిన బోట్లు

అల్లకల్లోలం

ఉప్పాడలో మత్స్యకార గ్రామంపైకి ఎగసిపడుతున్న కడలి

మొంథా తుపాను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను అల్లకల్లోలం చేసింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేదిపాలెంల తీరాన్ని తాకినప్పటి నుంచి విధ్వంసాన్ని సృష్టిస్తూనే ఉంది. తుపాను ధాటికి భారీ వృక్షాలు సైతం నేలవాలాయి. వందలాది కొబ్బరి చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్లు విరిగి పడ్డాయి. ఈదురుగాలులు, భారీ వర్షానికి వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాలేక గ్రామాలు అంధకారం చిక్కుకున్నాయి. రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలడంతో రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రజలు ప్రాణాలు గుప్పిట పట్టుకుని ఈ రోజు దాటితే చాలంటూ పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు.

- మొంథా ప్రభావంతో విస్తారంగా వర్షాలు
- ఈదురుగాలులతో విరుచుకుపడ్డ తుపాను
- నేలవాలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్లు
- పలు నివాస గృహాలకు నష్టం
- అంధకారంలో ప్రభావిత గ్రామాలు

ప్రజాశక్తి - కాకినాడ, రాజమండ్రి ప్రతినిధులు, అమలాపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను తీవ్ర రూపంగా మారి తీరంపై విరుచుకుపడింది. దీని ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. ఈదురు గాలులు వీచాయి. ఉప్పాడ, ఓడలరేవు, అంతర్వేదిలో సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. ఉప్పాడలో అలల తాకిడికి పెద్దపెద్ద బండరాళ్లు సైతం ఎగిరిపడ్డాయి. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. అలల తాకిడికి యు.కొత్తపల్లి మండలంలో మత్స్యకార గ్రామాలు కోతకు గురయ్యాయి. కోనసీమ జిల్లాలో అన్ని మండలాల్లోనూ తుపాను ప్రభావం కనిపించింది. పలుచోట్ల వృక్షాలు, కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాను అధికారులు ముందు జాగ్రత్త చర్యగా నిలిపేశారు. రాత్రి అంతా చాలా గ్రామాలు అంధకారంలోనే ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. విద్యుత్ స్తంభాలను విరిగిపడ్డాయి. సిబ్బంది వీటిని వెంటనే సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల ఇంకా పొలాలు ముంపులోనే ఉన్నాయి.

అలల ఉద్ధృతికి ధ్వంసమైన కాకినాడ- ఉప్పాడ బీచ్ రోడ్డు

పునరావాస కేంద్రాల్లో అరకొరగానే సౌకర్యాలు

తుఫాను నేపథ్యంలో కోనసీమ జిల్లాలో 13వేల మందిని 271 పునరావాస కేంద్రాలకు తరలించారు. కొన్ని శిబిరాల్లో విద్యుత్ సౌకర్యం లేక నిర్వాసితులు ఇబ్బందులు పడ్డారు. రావులపాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ముగ్గురు బాలింతలు కొవ్వొత్తుల వెలుతురులోనే ఉన్నారు. తాళ్లరేవు, పిఠాపురం, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో భోజనం మినహా మిగిలిన సౌకర్యాలు ఏవి సక్రమంగా లేవని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పడుకునేందుకు ఎలాంటి సౌకర్యాలు లేవని తెలిపారు.

సురక్షిత ప్రాంతాలకు గర్భిణులు, బాలింతలు

కాకినాడ జిల్లాలో 95 మంది గర్భిణులను, 1,400 మంది బాలింతలను 52 ఆసుపత్రులకు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హాస్టళ్లలో చదువుతున్న 14,499 మంది విద్యార్థులను సురక్షితంగా ఇంటికి పంపారు. 4,573 బోట్లు కొట్టుకుపోకుండా ఉప్పుటేరు, క్రీక్ లలో ఉంచుకోవాలని మత్స్యకారులకు సూచించారు.

ఏలేరుకు పోటెత్తుతున్న వరద

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఏలేరుకు వరద నీరు పోటెత్తింది. ఏలేరు జలాశయం నుంచి దిగుప్రాంతాలకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం సామర్థ్యం 86.56 కాగా ప్రస్తుతం 85.38 అడుగులకు నీరు చేరింది. 21.72 టిఎంసిల నీరు నిల్వ ఉంది. 21 టిఎంసిల కంటే అదనంగా వస్తున్న జాలాలను అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. తునిలో తాండవ నదికి వరద నీరు పోటెత్తింది.

తాడిచెట్టు కూలి మహిళ మృతి

ప్రజాశక్తి-మామిడికుదురు

మాకనపాలెంలో తాడిచెట్టు విరగిపడి గూడపల్లి వీరవేణి(56) అనే మహిళ మృతి చెందింది. ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నగరంలో తాడిచెట్టు కూలడంతో మందపాటి ప్రవీణ్(15) గాయపడ్డాడు. ప్రస్తుతం బాలుడు రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మొగలికుదురులో ప్రయాణిస్తున్న కారుపై కొబ్బరి చెట్టు పడింది. ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు.

పంటలకు తీవ్ర నష్టం

కోనసీమ జిల్లాలో 11,500 ఎకరాల్లో వరి పంట నీటి మునిగింది. మరో 432 ఎకరాల్లో పంట నేలవాలింది. తూర్పు గోదావరి జిల్లాలలో 15,425 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. మరో 600 ఎకరాల్లో ముంపునకు గురైంది. 1,997 ఎకరాల్లో మినప పంటకు నష్టం వాటిల్లింది. కాకినాడ జిల్లాలో 3,128 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కోనసీమ జిల్లాలో కొబ్బరి చెట్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 100కుపైగా కొబ్బరి చెట్లు కూలిపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఉద్యాన పంటలైన అరటి, బొప్పాయి పంటలకూ నష్టం వాటిల్లింది. కూరగాయల పంటలు నీట మునిగాయి. నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంది.

రామచంద్రపురంలో నేలకొరిగిన పంట

తాళ్లరేవులోని పునరావాస కేంద్రంలో నిర్వాసితులు

కూలిన ఇళ్లు, విద్యుత్ స్తంభాలు, సెల్‌టవర్లు

తుపాను ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో ఇళ్లు కూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. కొన్ని చోట్ల సెల్‌టవర్లకూ నష్టం వాటిల్లింది. కాకినాడ జిల్లాలో 53 ఇళ్లకు నష్టం వాటిల్లింది. సుమారు 9.62 లక్షలకు నష్టం వాటిల్లింది. ఒక బోటు ధ్వంసం అయ్యింది. సుమారు రూ.20వేల నష్టం వాటిల్లింది. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, కిర్లంపూడిలో కాలువల గట్లకు, వంతెనలకు రూ.51.30 లక్షల మేర నష్టం వాటిల్లనట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 33/11 కెవి ఫీడర్లు 52, 11 కెవి ఫీడర్లు 214, 33/11 కెవి సబ్‌స్టేషన్లు 38, మరో 181 విద్యుత్ స్తంభాలు, 11 కెవి కండక్టర్‌కు నష్టం వాటిల్లింది. తూర్పు గోదావరి జిల్లాలో 76 కచ్చా గృహాలు శిథిలమైనట్టు గుర్తించారు. వీటిలో ఏడు గృహాలకు నష్టం వాటిల్లింది. ఒక నివాస గృహం పూర్తిగా శిథిలమైంది. 13 విద్యుత్ స్తంభాలకు నష్టం వాటిల్లింది. వీటిని సిబ్బంది సరిచేశారు. 21 వృక్షాలు నేలకొరిగాయి.

మామిడికుదురులో నేలకొరిగిన కొబ్బరి చెట్టు

అందుబాటులో 24 గంటల పాటూ వైద్యులు

ప్రజాశక్తి - అమలాపురం

తుపాను వల్ల ప్రజలకు ఎటు వంటి అనారోగ్య సమస్యలు, గాయాలు వంటి ఇబ్బందులు తలెత్తినా అంబులెన్స్‌లతోపాటు 24 గంటల అత్యవసర వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కిమ్స్ హాస్పిటల్స్ ఛైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు (చైతన్య రాజు), కిమ్స్ హాస్పటల్స్ ఎండీ కలిదిండి రవివర్మ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కిమ్స్ ఆసుపత్రి, దానికి అనుబంధంగా పనిచేసే మెడ్ యునై టెడ్ హాస్పటల్స్ తుపాను వంటి విపత్కర సమయాల్లో ప్రజలకు అత్యవసర వైద్యసేవల ఒదిచేందుకు ముందుకు రావడంపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఒక వేళ అనుకోని ప్రమాదం సంభవించినా అత్యవసర వైద్య సహాయం అందించేందుకు కిమ్స్ హాస్పటల్స్ సిద్ధంగాఉంటాయని చైతన్యరాజుర తెలిపారు.

జిల్లాలో ఆర్‌టిసి బస్సుల నిలిపివేత

ప్రజాశక్తి - అమలాపురం

మొంథా తుపాను ప్రభావం కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఆర్‌టిసి బస్సులను తాత్కాలికంగా నిలిపివేశామని జిల్లా ప్రజా రవాణా అధికారి రాఘవ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. తుపాను పూర్తిగా తగ్గే వరకు ప్రయాణికులు ఎవరూ బస్టాండ్లకు రాకూడదని ప్రజలను విజ్ఞప్తి చేశారు. కోనసీమ జిల్లాలో తుఫాను ప్రభావం అధికంగా ఉంటుందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

తుపాను బాధితులకు అండగా నిలవాలి

సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - అమలాపురం

మొంథా తుపాను బాధితులకు ప్రజా సంఘాల, కార్యకర్తలు అండగా నిలవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం అమలాపురం గొల్లగూడెం సిపిఎం కార్యాలయంలో జి. దుర్గాప్రసాద్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తుపాను కారణంగా జిల్లావ్యాప్తంగా అపార నష్టం వాటిల్లిన నేపథ్యంలో జిల్లాలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి లోతట్టు ప్రాం తాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తుపాను ప్రాంతంలో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవా లని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలందరికీ నిత్యావసర వస్తు వులు అందించాలని, తుపాను తీవ్రత నేపథ్యంలో ప్రతి పేద కుటుంబానికి రూ.10వేలు జీవన భృతి అందిం చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుపాను సహాయక చర్యల్లో పార్టీ ప్రజా సంఘాల కార్యకర్తలు అందరూ పాల్గొనాలన్నారు. అధికారులతో ప్రజలు ఎదుర్కొంటున్న టువంటి సమస్యల్ని ఎప్పటికప్పుడు చర్చించి తుపాను ప్రభావం నుంచి ప్రజలందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించే దాంట్లో కార్యకర్తలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. తుపాను కారణంగా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులపై చర్చించారు. తుపాను బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖలను సమన్వయంతో పని చేయించాలన్నారు. భారీ వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని అంచనా వేసి, ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పునరావాస కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించాలని వృక్షాలు, ఇళ్లు కూలిపోతున్న నేపథ్యంలో వాటిని తొలగించేటువంటి చర్యలు వేగవంతం చేయాలని, విద్యుత్ స్తంభాలు కూలిపోతున్న నేపథ్యంలో సత్వరం ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె.కృష్ణవేణి, టి.నాగ వరలక్ష్మి, ఎన్.బలరాం, డి.లక్ష్మీ, డివి.రావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పోలీసుల పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మొంథా తుపాను కారణంగా సంభవించిన ఈదురు గాలులు, భారీ వర్షాలకు పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు ద్రాక్షారామ మెయిన్ రోడ్డులో ఎస్ఐ లక్ష్మణ్ తన సిబ్బందితో మొత్తం దుకాణాలన్నీ మూయించి వేశారు. ప్రజలను అప్రమత్తంగా ఉండాలని రోడ్లపైకి రావద్దని ఆయన సూచించారు. ఈదురు గాలులు భారీగా వేస్తున్నందున ప్రజలంతా ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని ఈ సందర్భంగా హెచ్చరించారు. ద్రాక్షారామం-యానాం మెయిన్ రోడ్డు, ద్రాక్షారాం- కాకినాడ రోడ్డు, ద్రాక్షారామం-రామచంద్రపురం రోడ్డు, కోటిపల్లి రోడ్లలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం మార్కెట్లోని షాపులన్నీ మూసివేయడంతో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. విద్యుత్ విద్యుత్ సరఫరా ఉదయం నుండి నిలిచి పోవడంతో గ్రామాల్లో అంధకారం నెలకు ఉంది.

యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించాలి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమలాపురం

ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టా లకు తావు లేకుండా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా ఇన్‌ఛార్జి వ్యవసాయ, సహకారం. మార్కెటింగ్‌శాఖ, డైరీ డెవలప్మెంట్ మత్స్య శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఆయన వివిధ శాఖల అధికారులతో మొంథా తుపాను తీవ్రత, సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల నిర్వహణ రోడ్లు రాకపోకలు విద్యుత్ సరఫరా అంశాలపై ప్రత్యేక అధికారి విజయరామరాజు, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధ్యక్షతన సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీ జి.హరీష్ మాదుర్, ఎంఎల్‌ఎలు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల సుబ్బరాజు, ఎస్‌పి రాహుల్ మీనా, జెసి టి.నిశాంతి, డిఆర్ఒ కె.మాధవి, ఆర్అండ్‌బి ఆర్ డబ్ల్యు ఎస్, అగ్నిమాపక విపత్తుల స్పందన, పంచాయతీరాజ్ విభాగాల అధికారులు ఇంజనీర్లు పాల్గొన్నారు.

సహాయక చర్యలపై వీడియో కాన్ఫరెన్స్

స్థానిక కలెక్టరేట్ నుంచి వార్డు, గ్రామ సచి వాలయ స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించి తుపాను సన్నద్ధత సహాయక చర్యలపై మంగళవారం తుపాను సహాయక చర్యల ప్రత్యేక అధికారి వి.విజయ రామరాజు సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ మొంథా తుపాను డాక్టర్ జిల్లా పరిసర తీర ప్రాంతాలలో మంగళవారం రాత్రికి తీరం దాటే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ కాట్రేనికోన, ఐ. పోలవరం, సఖినేటిపల్లి ,మల్కిపురం, ఉప్పలగుప్తం, కొత్తపేట మండలాలు సుమారుగా 7 వేల మందినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, డిఆర్ఒ కె.మాధవి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

గ్రామాలను సందర్శించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - మామిడికుదురు

రాజోలు ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్, టిడిపి ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య కరవాక మరియు గొల్లపాలెం ప్రాంతాల్లో మంగళవారం పర్యటించి ప్రజలకు తగు సూచనలు చేశారు. పూరిళ్లలో ఉన్నవారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తప్పనిసరిగా వెళ్లాలి అని విజ్ఞప్తి చేశారు. పునరావాస కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలని ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ ఆదేశించారు.


కరవాకలో కాలనీవాసుల ఇబ్బందులు తెలుసుకుంటున్న ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్

ముంపు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండటంతో కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామంలోని ముంపు ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ పర్యటించారు. తీర ప్రాంతంలో రక్షణా చర్యలు ప్రస్తుత పరిస్థితులపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అత్యవసరమైతేనే తప్ప బయటకు రావొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



పలుచోట్ల పునరావాస కేంద్రాల ఏర్పాటు

ఎర్రపోతవరంలో పునరావాస కేంద్రంలో దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో అధికారులు పునరావస కేంద్రాల ఏర్పాటు చేశారు. బాధితులను పునరావాస కేంద్రాలను చేరవేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పునరావాస కేంద్రాలను సందర్శించిఏర్పాట్లను పరిశీలించారు.

రామచంద్రపురం: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండ చూడాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కె. గంగవరం మండలంలోని గోదావరి తీర ప్రాంతా లైన్ పామర్రు, కూళ్ల, సుందరపల్లి, మసకపల్లి తదితర గ్రామాల్లో తుపాను ప్రభావిత ప్రాంతాలు, పునరావాస శిబిరాలను మంత్రి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. మండలంలోని ఎర్ర పోతవరం గ్రామంలో తుపాను బాధితులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు బాధితులకు దుప్పట్లు పంపిణీ చేసి, మందులు, ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సూరిబాబు, కూటమి నాయకులు రాయపరెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మండలంలోని వల్లూరు, టేకి గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పరిశీలించారు. రామచంద్రా పురం ఆర్‌డిఒ అఖిల అధికారులతో కలిసి వల్లూరు, వెదురుమూడి, తదితర గ్రామాల్లో పునరావాస కేంద్రాలను పరిశీలించారు. **అయినవిల్లి:** తుపాను ప్రభావం దృష్ట్యా ప్రభుత్వం 41 పునరవస కేంద్రాలు ఏర్పాటు చేసి 200 మంది గ్రామ ప్రజలను పునరవస కేంద్రాలకు తరలించి సదుపాయాలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పునరవస కేంద్రాలను ప్రత్యేక అధికారి టి.సాయి నాథ్ జై శంకర్ గాంధీ పి. గన్నవరం నియోజకవర్గ తుపాను స్పెషల్ ఆఫీసర్ సందర్శించారు బాలయోగి చారిటబుల్ ట్రస్ట్ సొసైటీ అధ్యక్షులు గంగుమళ్ల శ్రీనివాస్ సందర్శించి బాధితులకు 2000 బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ విద్యాపతి, ఎంపిడిఒ సరోవర్, తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** మొంథా తుపానుకు సంబంధించి 22 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంపిడిఒ ఎ.రాజు తెలిపారు. ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటన చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరెడ్డి, నేతలు పాల్గొన్నారు. **పి.గన్నవరం:** వాడ్రేవుపల్లిలో తాటాకు ఇంట్లో ఉండిపోయిన వృద్ధుడిని గ్రామ టిడిపి నాయకులు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన వెంకటేశ్వరావు సురక్షత ప్రాంతానికి తరలించారు. కార్యక్రమంలో మండల ఎస్‌సి సెల్ ప్రభుదాస్, బి.వెంకటరమణ, గోగు రోహిత్, దొనపాటి నరసింహమూర్తి, కోళ్ళ సాయి తదితరులు పాల్గొన్నారు. **అంబాజీపేట:** తుపాను ఎక్కువగా ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పూరి గుడిసెల్లో ఉన్న కుటుంబాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో సురక్షితంగా ఉండాలని నియోజకవర్గం టిడిపి కో కన్వీనర్ డివివి.సత్య నారాయణ, టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యనిర్వాహన కార్యదర్శి పెదపూడి శ్రీనివాస్ రావు కోరారు. పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపిటిసి పి.రాంబాబు, సొసైటీ ఛైర్మన్ దోమెట్టి సురేష్, జనసేన అధ్యక్షులు గోలకోటి నరేష్, ఎన్‌డిఎ కూటమి నాయకులు నేదునూరి పెద్దిరాజు, కూటమి శ్రేణులు ప్రజలు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** మండలంలోని, ఆత్రేయపురం గ్రామం లోని మండల ప్రజా పరిషత్ మెయిన్ స్కూల్ మరియు పులిదిండి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం ఎంపిడిఒ బికెఎస్‌ఎస్. వెంకటరామన్ సందర్శించారు. **కొత్తపేట:** నియోజకవర్గంలోని రావులపాడు, వానపల్లి శివారు సంఘంపాలెం పునరావాస కేంద్రాలను ఎంఎలఎ బండారు సత్యానందరావు, ఆర్‌డిఒ పి.శ్రీకర్ పరిశీలించారు **సఖినేటిపల్లి :** మండలంలోని తుఫాను ప్రభావిత గ్రామాలలో బాధితులకు రెవెన్యూ అధికారులు భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. సఖినేటిపల్లి తహశీల్దార్ ఎం వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఆయా గ్రామాలలోని రెవెన్యూ పంచాయతీ సిబ్బందితో కలిసి బాధితులకు ఏర్పాట్లు చేశారు. **రాజోలు:** రాజోలు తహశీల్దార్ భాస్కర్ మరియు ఎస్ఐ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో 16 పునరావాస కేంద్రాలకు 898 మందిని తరలించారు. **రావులపాలెం:** పొడగట్లపల్లి పంచాయతీలో 18వందల కుటుంబాలు ఉండగా వారిలో 45 కుటుం బాలను హైస్కూల్లో కొన్ని కుటుంబాలు, ఆయా వార్డుల భవనాల్లో కొన్ని కుటుంబాలు పునరావాసం కల్పించారు.

వల్లూరులో పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎంఎల్‌ఎ వేగుళ్ల

రావులపాడు పునరావాసం కేంద్రాన్ని సందర్శించిన ఎంఎల్‌ఎ బండారు

కోనసీమలో మొంథా విధ్వంసం

- నేలకొరిగిన వృక్షాలు.. దెబ్బతిన్న రోడ్లు
- దెబ్బతిన్న వరి పొలాలు
- కూలిపోయిన కరెంట్ స్తంభాలు
- పలుచోట్ల కూలిన తాటాకిళ్లు

ఎన్ హెచ్ 216ఎ పై కూలిన చెట్ల తొలగింపులో ఎస్ఐ నరేష్ తదితరులు

వాసాలతిప్పలో అల్లకల్లోలంగా మారిన సముద్రం

ఉప్పలగుప్తంలో గాలులకు ఊగుతున్న కొబ్బరి చెట్లు

కొత్తపేట మండలంలో నేలకొరిగిన భారీ వృక్షం

పులిదిండి ఆర్అండ్బిరోడ్డుపై కూలిన వృక్షం

పల్లిపాలెం గ్రామంలో వృద్ధుడిని సురక్షిత ప్రాంతానికి చేరుస్తున్న ఎన్డిఆర్ఎఫ్ బృందం

కపిలేశ్వరపురం మండలంలో విరిగిన కొబ్బరి చెట్లు

రాజోలు మండలంలో ఇంటిపై కూలిన కొబ్బరిచెట్టు

సఖినేటిపల్లిలో రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో మొంథా తుపాను మంగళవారం విధ్వంసం సృష్టించింది. తుపాను ప్రభావంతో చెట్లు నేలకూలాయి. తాటాకిళ్లు ధ్వంసమయ్యాయి. రహదారులు దెబ్బతిన్నాయి. వరి పొలాలు నేలకొరిగాయి. జిల్లా అంతా జనజీవనం స్తంభించింది. **సఖినేటిపల్లి**: మొంథా తుఫాన్ ప్రభావంతో సఖినేటిపల్లి మండలం తీర ప్రాంతగ్రామాలలో వర్షాలతో పాటు ఈదురు గాలులు వీశాయి. గాలులు దాటికి కొబ్బరిచెట్లు ఊగుతూ భయాందోళనలు రేపుతున్నాయి. మండలంలో తీరగ్రామాలైన కేశవదాసుపాలెం, అంతర్వేది కర తుఫాను ఆశ్రమభవనాలతో పాటు మండలంలో సుమారు 400 లకు భాదితులకు రెవెన్యూ అధికారులు ఆశ్రమం కల్పించారు. అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లే అన్ని రకాల బోట్లు కలిపి సుమారుగా 200 బోట్లను పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్లో జెట్టి వేసి నిలిపివేశారు. సఖినేటిపల్లి మండలంలో 26 ఎకరాలలో మాత్రమే నాట్లు వేశారు. ఈ పంట పూర్తిగా నీట మునిగింది. లాకుపేట వద్ద సఖినేటిపల్లి కెఎన్ఎఫ్ ప్రధాన రహదారిపై ఈదురు గాలులకు చెట్టు రోడ్డు పై కూలింది. తక్షణమే స్పందన ప్రభుత్వ యంత్రాంగం ఎన్డిఆర్ఎఫ్ బృందాలు చెట్టును కట్టర్లతో తొలగించారు. రాజోలు సిఐ నరేష్ కుమార్, విఆర్ఒ వేణు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని, పూరి గుడిసెల్లో నివాసంలో ఉన్న ఎన్డిఆర్ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు చేరుస్తున్నాయి. అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి సోదరిగా భావించి అశ్వరూడాంభిక (గుర్రాలక్క) ఆలయం చుట్టూ నీరు చేరింది. **ఆలమూరు:** మండలంలోని మూలస్థానం జొన్నాడ మధ్య 216 ఎ జాతీయ రహదారిపై ఈదురు గాలులకు చెట్లు కూలి రహదారి కి అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ జి.నరేష్ తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి విచ్చేసి తొలగింపు చర్యలు చేపట్టారు. **ఉప్పలగుప్తం:** ఎస్.యానంలో ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనంద రావు, అధికారులు పర్యటించారు. చల్లపల్లి తీర గ్రామమైన వాసాలతిప్పలో ఎస్పి రాహుల్ మీనా పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. నియోజక ప్రత్యేకాధికారి, డ్వామా ఎపిడి డి.రాంబాబు, మండల ప్రత్యేకాధి కారి జి.కెనడి, తహశీల్దార్ విఎస్.దివాకర్ తదితరులు మండలం లో పర్యటించారు. **ఐ.పోలవరం:** మండలంలో ఈదురుగాలులకు కొన్ని చోట్ల చెట్లు పడిపోయాయి. కొన్ని చోట్ల వరి పంట నేల కొరిగింది. **ఆత్రేయపురం**: తుపాను కారణంగా వచ్చిన ఈదుగాలులకు 17 గ్రామాలలో వరి, ఉద్యానవన పంటలు దెబ్బతిని రైతులకు అపార నష్టం వాటిల్లింది. 98 హెక్టార్లలో వరి పంట నేలకొరిగినట్లు వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు. పులిదిండి గ్రామం వద్ద ఆర్ అండ్ బి రోడ్డుపై భారీ వృక్షం కూలిపోవడంతో పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు జెసిపి సాయంతో వాటిని తొలగించారు. **కొత్తపేట:** కొత్తపేట మండలంలో పలుచోట్ల వృక్షాలు, కొబ్బరి చెట్లు నేలకూలాయి. రోడ్లకు ఒరిగిన చెట్లను తక్షణ చర్యలు చేపట్టి రాకపోకల అంత త్రయం లేకుండా చేశారు **కాట్రేనికోన:** రక్షణ చర్యల్లో భాగంగా ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచారు. మండల వ్యాప్తంగా కొన్ని చోట్ల కొబ్బరి చెట్లు, భారీ వక్షాలు నేలకూరిగాయి. సామాజిక వేత పిఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో నేలకొరిగిన చెట్లను తొలగించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల కొండాలమ్మ గుడి సమీపంలో 216 ఎ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో వలస కూలీ మృతి చెందింది. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం..ఒడిశా రాష్ట్రం కోరపుట్టు జిల్లాలో అంపబలిలోని దొండగూడకు చెందిన వలస కూలీ కె.రమ(40) మండలంలోని చొప్పెల్ల ఇటుక బట్టీలలో తన భర్త సుధతో కలిసి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి జాతీయ రహదారి పైకి బహిర్భూమికి వెళ్లేందుకు వచ్చిందన్నారు. ఇంతలో గుర్తు తెలియని వాహనం రమను ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర గాయాలతో రమ అక్కడికక్కడే మతి చెందింది. ఈ మేరకు భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. అలాగే మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించారు.

పలు గ్రామాల్లో తెగిన విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి -రౌతులపూడి

బలంగా విస్తున్న గాలులతో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో మండలంలోని ఎ.మల్లవరం, బలరామపురం, పారుపాక గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్ప లేదు. తుపాను ప్రభావంతో చేతికి వచ్చిన పంట నష్టపోతున్నామని పత్తి రైతులు దిగులు చెందుతున్నారు. మండలవ్యాప్తంగా 700 ఎకరాలలో పత్తి పంట పండిస్తున్నారని, ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పునరావాస కేంద్రానికి రెండు వందల మంది

ప్రజాశక్తి -కరప

మండలం ఉప్పలంకలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి 200 మందిని తరలించినట్టు తహశీల్దారు టి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర అవసరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎస్ఐ టి.సునీత రోడ్లపై పడిన చెట్లను ట్రాఫిక్కు అంతరాయం లేకుండా తొలగించారని తెలిపారు. డిటి భద్రరావు, ఆర్ఐ పవన్, పంచాయతీ కార్యదర్శి దుర్గ భవాని, పాల్గొన్నారు.

పెరిగిన ఏలేరు వరద ఉధృతి

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

ఏలేరు రిజర్వాయర్ నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేయడంతో కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఏలేరు పరీవాహక గ్రామాల్లో ముంపు వాటిల్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతేడాది ఇదే తరహాలో జగ్గంపేట మండలం ఇర్రిపాక వద్ద ఏలేరు కాలువ గట్లు తెగాయి. దీంతో గట్టును ఇసుక బస్తాలతో పటిష్ట పరుస్తున్నారు. మంగళవారం రెవిన్యూ అధికారులు, పోలీసులు, టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆ పనులను పర్యవేక్షించారు. మండలంలో ఎక్కడైనా ముంపు ప్రభావం ఉంటే వాటిని ఎదుర్కొనే విధంగా అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. సిఐ వైఆర్కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏలేరు పరీవాహక గ్రామాల వెంబడి పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అవినీతి రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి-గండేపల్లి

అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూరంపాలెం పవర్ గ్రిడ్ డిజిఎం పవన్ కుమార్ అన్నారు. మంగళవారం సూరంపాలెం పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో అవినీతి అవగాహన వారోత్సవాల ప్రారంభోత్సవం మొదలయ్యాయి. ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు-2025లో భాగంగా ఉద్యోగులు, కళాశాల, హైస్కూల్ విద్యార్థులకు 'విజిలెన్స్: మనందరి సంయుక్త భాధ్యత' అనే అంశంపై వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులకు అవగాహనా సదస్సులు నిర్వహించి జాగృతం చేస్తున్నామన్నారు.

క్యాంటీన్లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్లో పేదలకు అన్నదానం చేశారు. తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్ఛార్జి తుమ్మలపల్లి రమేష్ కాంటీన్లో పేదలకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కురుమళ్ల నాగేశ్వరరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-గండేపల్లి

యల్లమిల్లి దళిత కాలనీలో తుపాను కారణంగా కాలనీలో రోడ్డు అస్తవ్యస్తంగా తయారై డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండిపోయింది. టిడిపి నాయకుడు సుంకవిల్లి సత్యనారాయణ తన సొంత నిధులతో మంగళవారం రోడ్డు వేయించి డ్రైనేజీలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ స్ఫూర్తితో గ్రామంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ గణపతి, చీకట్ల నాగరాజు పాల్గొన్నారు.

శిథిల భవనం కూల్చివేత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట గడియార స్తంభం సెంటర్ ఎదురుగా సివిల్ స్థితిలో ఉన్న పురాతన భవనాన్ని తుపాను నేపథ్యంలో మంగళవారం జెసిబి సాయంతో కూల్చివేశారు. భారీ ఈదురుగాలులకు భవనం కూలి ప్రమాదం సంభవించనున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జెసిబి సహాయంతో తొలగించే పని చేపట్టారు. ఎంఎల్ఎ వెంట మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, టిడిపి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, నిమ్మకాయల రంగనాగ్ తదితరులు ఉన్నారు.

యానాం వార్తలు

ప్రమాదకర చెట్లు తొలగింపు...

ప్రజాశక్తి - యానాం

మొంథా తుఫాన్ ప్రభావంతో వీస్తున్న ఈదురు గాలుల నేపథ్యంలో ప్రజలకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. నియోజకవర్గ పరిధిలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను జెసిబిల సహాయంతో మున్సిపల్ సిబ్బంది మంగళవారం ఉదయం నుంచి తొలగింపు చర్యలు చేపట్టారు. మొంథా తుఫాన్ దుసుకొస్తున్న నేపథ్యంలో భారీ ఈదురు గాలులకు యానాంలో పలు భారీ వక్షాలు నేలకొరిగాయి. ఎన్డిఆర్ అఫ్ బృందం, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపాలిటీ తదితర శాఖల అధికారులు ఎప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన వాటిని తొలగిస్తున్నారు. స్థానిక అతిథి గృహం వద్ద భారీ మామిడి చెట్టు నేలకొరిగింది. త్యాగరాయ వీధిలో పాత కోర్టు వద్ద కొండమల్లి చెట్టు, భీమ్ నగర్లో భారీ మామడి చెట్టు, కనకాల పేటలో కొబ్బరి చెట్టు కరెంటు తీగలపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన వాటిని తొలగించి విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు ప్రయత్నాలు చేపట్టారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

తీర ప్రాంతాల్లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి - యానాం

మొంథా తుఫాన్ దూసుకొస్తున్న నేపథ్యంలో గోదావరి నది తీర ప్రాంతాలైన సావిత్రి నగర్, గిరియంపేట, దరియాలతిప్ప, ఫరంపేట అగ్రహారం తదితర ప్రాంతాల్లో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఎఒ అంకిత్కుమార్ సుడిగాలి పర్యటనలు చేశారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆర్ఎఒ అంకిత్కుమార్తో కలిసి పునరావస కేంద్రాలను పరిశీలించారు. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆర్ఎఒను కోరారు. తుపానును ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఎంఎల్ఎ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్ఎఒ అంకిత్ కుమార్ మాట్లాడుతూ అత్యవసర పనుల కోసం జెసిబిలు, చెట్లను నరికేందుకు యంత్రాలను సిద్ధం చేసినట్టు తెలిపారు. ఆరోగ్య కేంద్రాలు, జిప్మర్ ఆసుపత్రి, డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ప్రమాదాల్లో ఉంటే కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. లిక్కర్ షాపులు, ఇతర దుకాణాలు మంగళవారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. మల్లాడి కృష్ణారావు పలు గ్రామాల్లో పర్యటించి తుపాను తీవ్రతను ఎప్పటికప్పుడు పుదుచ్చేరి సిఎంకి ఫోన్లో వివరించారు.

అంధకారంలో యానాం...

ప్రజాశక్తి - యానాం

మొంథా తుపాను ప్రభావంతో భారీ వృక్షాలు, చెట్లు కరెంటు తీగలపై పడి వైర్లు తెగిపోవడంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ సందర్భంగా యానాం అంతా అంధకారంలో ఉంది. మంగళవారం ఉదయం నుంచి కరెంటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం రాత్రి పలు గ్రామాల్లో పర్యటించి కొవ్వొత్తులు పంపిణీ చేశారు.

యాత్రికులు మెచ్చేలా పరిశుభ్రత

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానానికి వచ్చే యాత్రికులు మెచ్చుకునేలా పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని దేవస్థానం ఇఒ వి.సుబ్బారావు ఆదేశించారు. మంగళవారం కొండపైన కమాండ్ కంట్రోల్ రూమ్లో శానిటేషన్ విభాగంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇఒ మాట్లాడుతూ శానిటేషన్ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అందుకు అనుగుణంగా ఆయా ప్రదేశాల వద్ద విధులు నిర్వహించే సూపర్వైజర్లు పారిశుధ్య కార్మికులతో పనులు చేయించి పరిశుభ్రత కనబడే విధంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. సత్రాలు ప్లాట్ ఫామ్లు వ్రత మండపాలు, మెట్ల మార్గంలోనూ శానిటేషన్పై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

బహిరంగ వేలం పాట వాయిదా

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారికి యాత్రికులు సమర్పించే మేకలు, కోళ్లు తీసుకునేందుకు 5 నెలల కాల పరిమితి హక్కుకు సంబంధించి ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటకు ఎవరూ హాజరు కాకపోవటంతో వేలం వాయిదా వేసినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ఈ వేలం పాట ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత తెలియజేస్తామన్నారు.

ఏలేరు కాలువ గట్టు పటిష్టతకు చర్యలు

ప్రజాశక్తి-సామర్లకోట

ఏలేశ్వరం వద్ద ఏలేరు ప్రాజెక్టు నుంచి అంతకంతకూ నీటిని కిందకి విడుదల చేయడంతో ఏలేరు కాలువలో సామర్లకోట వద్ద పొంగి ప్రవహిస్తోంది. సామర్లకోట కాలువ ద్వారా వికె.రాయపురం మీదుగా కాకినాడ సముద్రంలో ఏలేరు జలాలు కలుస్తాయి. ఈ నేపథ్యంలో సామర్లకోట మండలం వికె.రాయపురం వద్ద బలహీనంగా ఏలేరు కాలువ గట్టు సుమారు 5500 ఇసుక బస్తాలతో పటిష్టంగా చేసే చర్యలు సోమవారం రాత్రి నుండి చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 3000 ఇసుక బస్తాలతో పని చేపట్టగా మిగతా పని కొనసాగుతోంది. ఈ పనులను సామర్లకోట డిప్యూటీ తహశీల్దార్లు యడ్ల శ్రీనివాస్, కె.పద్మజ పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది తున్న ఈ గట్టు బలహీనంగాగా తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసి రక్షణ చర్యలు చేపట్టారు. ఈ గట్టుకు గండి పడితే మండలంలోని వికె.రాయపురం, బోయినపూడి గ్రామాలు ముంపునకు గురి కావడంతో పాటు వందలాది ఎకరాల్లో పంట నష్టపోయే ప్రమాదం ఉంది. పనులను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తదితరులు పరిశీలించారు.

ఏలేరు రిజర్వాయర్ భారీగా వరద నీరు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

తుపాను ప్రభావంతో ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు రిజర్వాయర్లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్లోకి మంగళవారం మధ్యాహ్నం వరకు సరాసరి 2000 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరింది. భారీ వర్షాలతో రిజర్వాయర్లోకి వరద నీరు పెరిగి 6500 క్యూసెక్కుల వరకు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు దిగుప్రాంతాలకు 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ సామర్థ్యం 86.56 మీటర్లు కాగా రిజర్వాయర్లో ప్రస్తుతం 85.39 మీటర్లకు చేరుకుంది. దిగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో రిజర్వాయర్ నుంచి నీటి విడుదల వల్ల జగ్గంపేట, కిర్లంపూడి, పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల్లో పల్లపు ప్రాంతాలు, పంట పొలాలకు వరద ముంపు పొంచి ఉంది.

పంటల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గంపేట

ఏలేరు కాలువ ద్వారా ముందుగా సాగు చేసిన వరి పంటలను మంగళవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మండలంలోని రామవరం, కాట్రావులపల్లి, జగ్గంపేట గ్రామాల్లో కోతకు వచ్చే వరి పొలాలను పరిశీలించినట్లు మండల వ్యవసాయాధికారి నరసింహం తెలిపారు.

MUNICIPAL CORPORATION, RAJAMAHENDRAVARAM

ENGINEERING SECTION

REQUEST FOR PROPOSAL **Dated: 24-10-2025**

Request for Proposal are invited for the following works from the eligible contractors only.

Sl.No.	RFP / NIT No.	Name of the work
1	33/MCR/RFP/ 2025-26	Design Development and Beautification of Various Parks & Open Spaces in Rajamahendravaram City (Package-2) 5th Call
2	262/MCR/RFP/ 2025-26	Design Development and Beautification of Various Parks & Open Spaces in Rajamahendravaram City (Package-4)

RFP can be downloaded from e-procurement web site www.apeprocurement.gov.in in Service Sector from **Dt.24-10-2025 at 10.00 P.M** on wards. Last date of time of receipt of RFP on or before **Dt.10-11-2025 upto 2.30 P.M**

Sd/- **RAHUL MEENA,** *IAS,*
Commissioner
Municipal Corporation, Rajamahendravaram

పాస్పోర్టు పోయినది

సయ్యద్ మదీన బాషా, S/o. మీర, డోర్ నెం. 50-8-26, నెహ్రూ నగర్, రాజమండ్రి, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నాకు విశాఖపట్నం పాస్పోర్టు కార్యాలయం అధికారులు **ది. 15-12-2015వ తేదీన N5374204** నెంబరు గల పాస్పోర్టు మంజూరు చేసియున్నారు. సదరు పాస్పోర్టు **ది. 20-10-2025వ తేదీన** నేను ఇల్లు మారుతుండగా రాజమండ్రి నెహ్రూనగర్ సెంటర్ నందు పడిపోయినది. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

సయ్యద్ మదీన బాషా
సెల్: 9908633775

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో అమలాపురం

I.A 996/2024, in

FDP 1306/2018, O.S.12/2012

Between:-

కముజు నాగవెంకట సత్యప్రసాద్ **...పిటీషనరు/వాది**

మరియు

1. లంకే వీర్రాజు (డైడ్)

R2. లంకే నాగబాబు S/o. Late లంకే వీర్రాజు, వయసు 28సం॥లు, హిందూ, డోర్నెం.3-189, కాట్రేనికోన విలేజ్, కాట్రేనికోన మండలం, డా॥బి.ఆర్.ఎ.కోనసీమజిల్లా.ఎ.పి

R3. నామాడి విజయలక్ష్మి W/o. వెంకటేష్, D/o Late లంకే వీర్రాజు, వయసు 26సం॥లు, హిందూ, వేట్లపాలెం విలేజ్, కాట్రేనికోన మండలం, డా॥బి.ఆర్.ఎ. కోనసీమజిల్లా.ఎ.పి **...రెస్పాండెంట్లు/ప్రతివాదులు**

పై నెంబరు గ్రంథములో రెస్పాండెంట్లు అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా నోటీసులు పంపగా మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తము **ది.7-11-2025** తేదికి వాయిదా వేసినారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30 ని॥లకు** స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
కాండ్రేగుల వర ప్రసాద్
అమలాపురం న్యాయవాది.
ది.28-10-2025 సెల్.9393003681

మహారాజశ్రీ పెద్దాపురం 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు
ARB EP No.293/2024 in AC 33/2023

Between:

M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సామర్లకోట బ్రాంచ్, Rep.by అటార్నీ హోల్డర్ Mr. లోకవరపు మల్లికార్జునరావు ....DHR

And

గోపు వీరభద్రరావు & అదర్స్ ....JDR's

1st JDR: గోపు వీరభద్రరావు,
S/o. పాపారావు, డోర్ నెం.1-49/బి, రామాలయం దగ్గర, రూపులమ్మ గుడి వీధి, ఏలేశ్వరం, కాకినాడ జిల్లా

వాయిదా: ది.20-11-2025

ఈ నెంబరు E.P. బాకీ వసూలు నిమిత్తం 1st JDR అయిన మీకు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా **Or 21. R54** నోటీసు పంపించి చున్ననూ ఉద్దేశ్యపూర్వకంగా **Avoid** చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ నెంబరు **E.P.** లో **JDR** అయిన మీరు ది.**20-11-2025**న పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. అట్లు కాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును.

తటవర్తి సత్యనారాయణ,
పెద్దాపురం **అడ్వకేట్**, పెద్దాపురం
ది.28-10-2025 సెల్: 98856 57091

మహారాజశ్రీ పెద్దాపురం 7th అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు
Arbitration O.P. No.08/2025

Between:

M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అటార్నీ హోల్డర్ Mr. లోకవరపు మల్లికార్జునరావు **... పిటీషనర్**

And

1.ఇంటి రాజ్యలక్ష్మి
2.ఎరికిరెడ్డి వెంకటేశ్వరరావు
3.ఇంటి రామకృష్ణ **... రెస్పాడెంట్స్**

R1: **ఇంటి రాజ్యలక్ష్మి**, W/o.రామకృష్ణ, డోర్ నెం.4-24, రామాలయం వీధి, వేలంక గ్రామం, కిర్లంపూడి మండలం, కాకినాడ జిల్లా

పై నెంబరు పిటిషన్ ది.14-11-2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా అయి ఉన్నది. పై పిటిషన్ నందు మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యడల పై కోర్టున ది.**14-11-2025**వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి మీరు స్వయంగా గాని, మీ న్యాయవాదితో గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయ్యి మీ వాదనను తెలుపు కొనవలెను. లేని యడల మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్పునిచ్చెదరు.

//శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం//

M.K. మొహియుద్దీన్
పెద్దాపురం **అడ్వకేట్**, పెద్దాపురం
ది.29-10-2025 సెల్: 95421 48566

In the Court of the Junior Civil Judge, Anaparthi
O.S. No. 34/2024

Between:
Canara Bank (Previously Syndicate Bak) Rep. by its Senior Branch Manager, Anaparthi Branch, Anaparthi ***...Plaintiff***

AND

M/s. Ramakrishna Industries, Biccavolu, Rep. by its Proprietor, Satti V.V.Siva Ramakrishna Reddy ***...Defendant***

To: ***Defendant:***
M/s. Ramakrishna Industries, Rep. by its Proprietor, Satti V.V.Siva Ramakrishna Reddy, S/o. Raghu Rama Reddy, Business, D.No. 1-223, Main Road, Mahendrawada Road, Polamuru - 533342, Boccavolu Mandal, E.G.District.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 07-11-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వేగుళ్ళ వెంకటరమణమూర్తి
అడ్వకేట్, గాంధీనగర్
కాకినాడ, సెల్: 9866033899